ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు



గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు



పాతమంగళగిరిలో జరిగిన ముగ్గుల పోటీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట శివదుర్గాపురంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు మంగళవారం ముగిశాయి. గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు (పండు) ఆధ్వర్యాన జరుగుతున్న ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు, చిన్నారులకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. వేణుగోపాలస్వామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే అందరి ఇళ్లల్లో కాంతులు నింపే పండుగ అని, ఈ పండుగ సందర్భంగా మేడా వెంకటేశ్వరరావు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా ప్రధానకార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, సచివాలయ కన్వీనర్లు కుంచాల శ్రీను, షేక్ హసీనా, మహమ్మద్ ఆలీ, ఎస్.అనిల్, ఎస్.సాయి, గణేష్, ప్రసాద్, అవినాష్, పండు ఫ్రెండ్ సర్కిల్ దితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గౌడ సంఘం ఆధ్వర్యంలో...

తాడేపల్లిరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యాన తాడేపల్లి పట్టణ, మండల పరిధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మంగళవారం తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో గౌడ సంఘం నాయకులు, రామ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. గౌడ సేవా సమితి తాడేపల్లి మండల నాయకులు మాట్లాడుతూ ఆచార వ్యవహారాల సమ్మేళనాల్లో భాగమైన పండుగలకే మనుషులకూ, సమాజానికి మధ్య అనుబంధాల వారధుల అని, వ్యవసాయం, రైతు, ప్రకృతి సమన్వయం చేసుకునే పలు వృత్తుల అనుసంధానం కూడా వీటిలో భాగమని అన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ కలసి చేసుకునేది ఈ సంక్రాంతి పండుగ అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం ముఖ్య సలహాదారు జోగి నాగేశ్వరరావు, రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ వాకా రామ్‌గోపాల్, గౌడ సంఘం నాయకులు కంచర్ల కాశయ్య, లచ్చి తులసి దాస్, శ్రీ బ్రాడ్ బ్యాండ్ అధినేత పలగాని శ్రీకాంత్, సువర్ణకంటి రాజశేఖర్, రేఖా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయ క్షత్రియ మహిళా పరిషత్ ఆధ్వర్యంలో...

మంగళగిరి: పట్టణంలోని పాతమంగళగిరిలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన పోటీలలో స్థానిక మహిళలు పాల్గొన్నారు. శ్రీ పద్మావతి దేవీ పద్మశాలీయ క్షత్రియ మహిళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి జడ్జిలుగా మాజీ కౌన్సిలర్లు వింజమూరి ఆషాబాల, దామర్ల పద్మజలు వ్యవహరించగా విజేతలకు పరిషత్ అధ్యక్షురాలు కొసనం జానకి, కొసనం శ్రీనివాసరావు, పద్మశాలీయ సంఘాల నాయకులు అందజేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

రాష్ట్ర సమాచార కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి



రావెల(తాడికొండ): సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ టి విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు భీమవరపు ధర్మారెడ్డి, ఈమని, భాస్కర్‌రెడ్డి, వంగపాటి బ్రహ్మం, ఏరువ లూర్దురెడ్డి, సింహాద్రి మధుసూదన్‌రెడ్డి, వరగాని వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

డీవైఎఫ్‌ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ పూర్వ జిల్లా కార్యదర్శి అప్పారావు

తాడేపల్లిరూరల్: యువతీ యువకుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీవైఎఫ్‌ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఐద్వా, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దర్శి చిన్న దుర్గారావు, బొందలపాటి ప్రభాకరరావు, బూరగ జయరావు, నవనీతం, బూరగ కిట్టు, చిన్న, శ్రీకాంత్,సాయి, యం.చిన్న చెన్నయ్య పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, వాలీబాల్, కబడ్డీ పోటీలను డీవైఎఫ్‌ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను జెట్టి బాలరాజు అందజేశారు. కార్యక్రమంలో వమన్న నరసింహారావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, బి. చిరంజీవి, జి.యోహాను, అజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం మంగళగిరి పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నూతన సంవత్సర యోగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్ విచ్చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యోగ సాధన ద్వారా మనిషి ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ, యోగ సాధకులు డోగిపర్తి శ్రీహరిరావు, కందం రాంబాబు, జె.నారాయణ, కాంద్రు కోటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద మకరజ్యోతి దర్శనం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి 22 కిలోల కర్పూరంతో మకరజ్యోతిని వెలిగించారు. కార్యక్రమానికి ముందుగా హరిహరసుత అయ్యప్పస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఏర్పాటుచేసిన ప్రదేశంలో 22కిలోల కర్పూరంతో జ్యోతిని వెలిగించారు. అనేక మంది భక్తులు అయ్యప్ప నామస్మరణ చేస్తూ జ్యోతిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్యసంఘపెద్దలు డి.నరేంద్రకుమార్, జి.మధుసూదనరావు, కె.వెంకటేశ్వరరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని మంగళగిరి వీవర్స్ కాలనీలో నగర పాలక సంస్థ హైస్కూల్‌లో ఇందిరానగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5గంటలకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామని, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ధార్మిక శిక్షణా తరగతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జిద్ ఎ మొహమ్మద్‌తో నిర్వహిస్తున్న ధార్మిక శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుర్రహ్మాన్ విచ్చేసి మాట్లాడారు. ఇల్మ్ ప్రాముఖ్యతపై అబ్దుల్ హఫీజ్ ఉమ్రీ, బిద్ అత్ పర్యవసానం అనే అంశంపై అబ్దుల్ మబూద్ జామితీ, సున్నత ప్రాముఖ్యతపై అబ్దుల్లా జామితీ, షిర్క్ (బహుదైవారాధన) అనే అంశంపై ఇల్యాస్ దాయీ, ఉలమాయే దీన్‌కి ఫజీలత్ అనే అంశంపై ఫయాజ్ ఆలమ్ అల్వానిలు ప్రసంగించారు.

చర్మకార సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులుగా సుబ్బారావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల చర్మకార సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా కంఠంరాజు కొండూరుకు చెందిన కొండూరు సుబ్బారావును రాష్ట్ర సంఘం నియమించింది. మంగళవారం ఆ నియామకపత్రాన్ని ఏపీ చర్మ కార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు కంఠంరాజు కొండూరు గ్రామంలో కొండూరు సుబ్బారావుకు అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో చర్మకారులు, డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసువెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, రాష్ట్ర చర్మకార సంక్షేమ సంఘం తనపై ఉంచిన బాధ్యతను నిర్వహిస్తానని అన్నారు.

రావుల శివారెడ్డికి నివాళి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో మంగళవారం సీపీఐ నియోజకవర్గ మాజీ కార్యదర్శి రావుల శివారెడ్డి మూడో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శివారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేషపూజలు చేశారు. ఉదయాన్నే స్వామివారికి అర్చకులు ప్రసన్నమూర్తి పంచామృతాలతో అభిషేకాలు చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మానికొండ ముత్యాలరావుకు నివాళి

తాడేపల్లిరూరల్: సీపీఐ నాయకుడు మానికొండ ముత్యాలరావు 43వ వర్ధంతి సభను మంగళవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షత వహించగా, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గుంకట సాంబిరెడ్డి, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గుంటక సాంబిరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ముత్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీనియర్ నాయకులు మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంకల్పసభను విజయవంతం చేయాలి

మంగళగిరి: ఈ నెల 18వ తేదీ జరిగే బీసీ సంకల్పసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సంకల్పసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీల హక్కుల సాధనకై జరుగుతున్న సభకు బీసీలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్రి వేణుమాధవ్, జింక దివ్యనారాయణ, ఉడతా శ్రీనివాస్, ఆలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో పేకాట శిబిరంపై దాడిచేసిన పోలీసులు ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేకాట శిబిరంపై దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.6,150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెదవడ్లపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.4500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చర్మకారులకు రుణాలు ఇప్పించాలి

మంగళగిరి: నగర పరిధిలోని చర్మకారులకు ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు కోరారు. మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేసి నగర పరిధిలోని 250 చర్మకారులు, డప్పు కళాకారులకు రుణాలు మంజూరు చేయించాలని వినతి పత్రం అందజేశారు.